

తోడుకున్నోళ్లకు తోడుకున్నంత

ఇసుకాసురులకు నదీ పరివాహక ప్రాంతాలు కల్పతరువుగా మారాయి. అనుమతులు లేకుండానే ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.

8లో



టమాట కిలో రూ.34

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.34, కనిష్టం రూ.27, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 34.7°/20.6°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రోజంతా ఎదురు చూపులు

- డీఎస్సీ ఎంపిక అభ్యర్థులకు రాని మెసేజ్‌లు
- నేటి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నేరుగా వారి వ్యక్తిగత మొబైళ్లకు మెసేజ్‌లు వస్తాయని ప్రకటించడంతో డీఎస్సీ-25కు ఎంపికై న అభ్యర్థులు ఆదివారం రోజంతా ఎదురు చూశారు. రాత్రి 10 గంటలైనా ఏ ఒక్కరికీ సమాచారం అందలేదు. మరోవైపు సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు సంబంధించి నగర శివారులో ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచి డీఈఓ అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మరోవైపు ఇక్కడి అధికారులకు కూడా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై డైరెక్టరేట్ నుంచి స్పష్టమైన సమాచారం అందలేదు. రాత్రయినా స్పష్టత లేకపోవడంతో అయోమయం నెలకొంది. ఓవైపు మెరిట్‌లో మంచి ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు, మరోవైపు అధికారుల్లో టెన్షన్ పట్టుకుంది. సాంకేతిక సమస్యలు, ఇతర సమస్యల కారణంగా ఎంపికైన అభ్యర్థులకు మెసేజ్‌లు పంపలేకపోతున్నట్లు ఉన్నతాధికారులు స్పష్టత ఇచ్చారు. ఆర్జేడీ ఆదేశాలతో సోమవారం జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలనను వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు ప్రకటించారు. తర్వాత రోజు (మంగళవారం) ఉండొచ్చని ఇక్కడి అధికారులు అంచనా వేస్తున్నా...సోమవారం దీనిపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతుందని, ప్రజలు తమ సమస్యలపై అర్జీల రూపంలో అందజేయవచ్చని సూచించారు.

52.2 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఫర్టిలైజర్ దుకాణాల్లో తేడా ఉన్న రూ.13,46,354 విలువగల 52.2 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం బత్తలపల్లిలోని హనుమాన్ ట్రేడర్స్, మోహన్ ట్రేడర్స్, మంజునాథ ట్రేడర్స్‌తో పాటు తొమ్మిది దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డితో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హనుమాన్ ట్రేడర్స్‌లో రూ.5,13,954 విలువ చేసే 24.88 మెట్రిక్ టన్నులు, మోహన్ ట్రేడర్స్‌లో రూ.7,28,000 విలువగల 23 మెట్రిక్ టన్నులు, మంజునాథ ట్రేడర్స్‌లో రూ.1,04,400 విలువగల 2.9 మెట్రిక్ టన్నుల ఎరువులు రికార్డుల్లో తేడాలు ఉన్న కారణంగా వాటి అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ డీసీటీఓ సురేష్‌కుమార్, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, బత్తలపల్లి ఏఓ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఎన్నిక



ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గం

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యుడు నిమ్మకాయల రాము నేతృత్వంలో ఆదివారం హిందూపురంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ 27 మందితో కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడిగా రిటైర్డ్ డీఎస్పీ గిరిధర్, అధ్యక్షుడి అడ్వకేట్ సుబ్బరాజుగుప్తా, ప్రధాన కార్యదర్శిగా నరేంద్ర, ఉపాధ్యక్షులుగా పాండురంగారావు, లక్ష్మీనారాయణ, రంగనాథం, కార్యదర్శులుగా నారాయణ, ఆనంద్, రవీంద్ర, కోశాధికారిగా ఎర్రజోడు చంద్ర తదితరులు ఎన్నికయ్యారు. గణేష్ ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా నిర్వహించడానికి ఈ సమితి కృషి చేస్తుందన్నారు.

‘మామూళ్ల మత్తు’తో గం‘జాయ్’



- కదిరిలో ఇటీవల గంజాయి డంప్ లభ్యం
- కేసులో అసలు నిందితులను తప్పించేందుకు పోలీసుల భారీ డీల్
- ఓ హోటల్ యజమానితో రూ.25 లక్షల బేరం
- గంజాయి సరఫరాలో బీజేపీ నేత కుమారుడి హస్తం
- తిమ్మిని బమ్మిని చేస్తున్న పోలీసు అధికారి
- గంజాయి అమ్మకాలకు అడ్డాగా మారిన కదిరి, తాడిపత్రి నియోజకవర్గాలు



ఈ నెల 22న పట్టుబడిన గంజాయి డంప్, నిందితులను చూపుతున్న కదిరి పోలీసులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గంజాయి ఒక్కసారిగా గుప్పుమంది. అంతా ఇంతా కాదు ఒకేసారి 50 కేజీలకు పైగా లభించింది. గంజాయి సరఫరా చేసినా, సేవించినా పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టి శిక్షిస్తామంటున్న పోలీసులే నిందితులను తప్పించే యత్నం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు భారీగా డీల్ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. కదిరి కేంద్రంగా జరిగిన ఈ గంజాయి స్కామ్‌లో ఓ పోలీసు అధికారి కీలక పాత్ర పోషించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గంజాయి బ్యాచ్ ఆగడాలతో తాడిపత్రి పట్టణంలో మహిళలు హడలెత్తిపోతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కదిరిలో గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువ కావడం సర్వత్రా ఆందోళనకు గురి చేస్తోంది.

హోటల్ యజమానితో భారీ బేరం..

మూడు రోజుల క్రితం కదిరి మండలం కొండమనాయునిపాలెం వద్ద భారీ గంజాయి డంప్ స్వాధీనమైంది. కానీ దొరికిన గంజాయి తక్కువ మోతాదులో ఉన్నట్టు చూపించారు. ఇందులో ఓ హోటల్ యజమాని హస్తం ఉంది. గంజాయి తెచ్చిన ఇన్నోవా కారుకు పోలీసు అని ఉండటంతో ఖాకీలు జాగ్రత్త పడ్డారు. హోటల్ యజమానికి సమీప బంధువైన ఏఆర్ కానిస్టేబుల్ ఒకరు పోలీసు స్టిక్కర్ వేసుకుని తిరుగుతుంటారు. అదే కారులో గంజాయి తెచ్చారు. కానీ ఈ కేసులో మిగతా ఆరుగురిని అరెస్టు చూపించిన పోలీసులు హోటల్ యజమానిని తప్పించారు. ఈ కేసు బయటపడిన రోజే హోటల్ యజమాని ఓ ప్రజాప్రతినిధి ఇంటికెళ్లి ఆయన్ను కలిసినట్టు తెలిసింది. కేసు నుంచి హోటల్ యజమానిని తప్పించేందుకు రూ.25 లక్షల బేరం కుదిరినట్టు సమాచారం. ఇలా గంజాయి నిందితులు కదిరి పోలీసులకు మంచి ఆదాయవనరుగా మారారని చెప్పుకోవచ్చు. ఇక.. ఇటీవల కదిరి సమీప ప్రాంతంలో రెండు వర్గాలకు చెందిన యువకులు కొట్టుకున్నారు. వెంటనే వారి తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలు గంజాయికి బానిసలయ్యారు కాబట్టే ఇవన్నీ చేస్తున్నారని వాపోయారు. పోలీసులు మాత్రం అదేమీ లేదని కొట్టిపారేయడం గమనార్హం.

పోలీసు అధికారి అన్నీ తానై..

గంజాయి అమ్మకాలకు ఇటీవల కదిరి అడ్డాగా మారింది. మొన్నటికి మొన్న పట్టణంలోని కాలేజ్ సర్కిల్‌లోని ఓ ఇంట్లో గొడవ జరగ్గా.. ఓ వ్యక్తి నేరుగా పోలీసుల దగ్గరికి వెళ్లి తమ రూములో కొంతమంది గంజాయి అమ్ముతున్నారని ఫిర్యాదు చేశాడు. అయితే, ఎవరికీ తెలియకుండా నేరుగా అక్కడికి వెళ్లిన ఒక పోలీసు ఉన్నతాధికారి ఈ వ్యవహారంలో ఓ బీజేపీ నేత కుమారుడి హస్తం ఉన్నట్లు గుర్తించారు. ఆ వ్యక్తిని గంజాయి కేసు నుంచి తప్పించారు. ఇందుకోసం హిందూపురం పార్లమెంటు పరిధిలోని ఓ టీడీపీ నేత సదరు పోలీసు అధికారికి ఫోన్ చేశారని, రూ.10 లక్షల డీల్ కుదిరిందని తెలుస్తోంది.

పరిస్థితి అదుపు తప్పుతోంది..

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో పరిస్థితి అదుపు తప్పుతోంది. ఊరూరా బెల్టుషాపుల తరహాలోనే నేడు గ్రామగ్రామన గంజాయి లభిస్తోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, కదిరి, ధర్మవరం ప్రాంతాలకు విచ్చలవిడిగా గంజాయి సరఫరా అవుతున్నట్టు తేలింది. ఎక్కువగా పాతికేళ్ల లోపు యువకులు గంజాయి మత్తులో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి. ప్రస్తుతం రిటైల్‌గా 50 గ్రాముల గంజాయి రూ.1,000 వరకూ అమ్ముతున్నట్టు తేలింది. పోలీసులే డబ్బు తీసుకుని గంజాయి విక్రేతలను వదిలేస్తుంటే పరిస్థితి అదుపు తప్పక ఏమవుతుందని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: దసరా, దీపావళి పండుగలకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్-తిరుపతి మధ్య వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ జంక్షన్ (07009) నుంచి సెప్టెంబర్ 4– సెప్టెంబర్ 25వ తేదీ వరకు ప్రతి గురువారం (4 సర్వీసులు) రైలు తిరుగుతుందన్నారు. తిరుపతి జంక్షన్ (07010) నుంచి సెప్టెంబర్ 5–సెప్టెంబర్ 26 వరకు ప్రతి శుక్రవారం నడుపుతున్నట్లు పేర్కొన్నారు. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి. రైళ్లలో ఫస్ట్ క్లాస్ కమ్ సెకండ్ ఏసీతోపాటు 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



తెలుగు తమ్ముళ్ల డిష్యుం.. డిష్యుం

- బొగ్గు వ్యాపారులతో కమీషన్ల కోసం గొడవ
- ఒక వర్గంలోని ఇద్దరికి గాయాలు
- నల్లబోయనపల్లిలో ఘటన





తీవ్రంగా గాయపడిన కౌశిక్, సాంబ

బత్తలపల్లి: తెలుగు తమ్ముళ్లు బరి తెగించారు. కమీషన్ల వసూలు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. దీంతో ఒక వర్గంలోని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వాహన అద్దాలు సైతం ధ్వంసమయ్యాయి. నల్లబోయనపల్లిలో ఈ ఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నల్లబోయనపల్లి వద్ద బొగ్గు వ్యాపారులు ముళ్లపొదలను కాల్చి వాటి నుంచి బొగ్గు సేకరిస్తుంటారు. ఇందుకుగాను మహారాష్ట్రకు చెందిన కూలీలను ఏర్పాటు చేసుకున్నారు. బొగ్గులను లారీల్లో తరలించే సమయంలోనూ, అటవీశాఖ అధికారులతో పర్మిషన్ ఇప్పించే విషయంలో టీడీపీకి చెందిన కట్టకిందపల్లికి చెందిన విశ్వనాథనాయుడు హస్తం ఉంటోందని సమాచారం. ఇందుకుగాను వ్యాపారుల నుంచి విశ్వనాథనాయుడుకు కొంతమేరకు సొమ్ము ప్రతిఫలంగా అందుతోంది. అయితే విశ్వనాథనాయుడు అనుచరుడైన నల్లబోయనపల్లికి చెందిన కౌశిక్ ఈ విషయంలో విభేదించాడు. తమ గ్రామంలో విశ్వనాథనాయుడు వసూలు చేసేది ఏమిటి.. తామెందుకు చేయకూడదు అని అనుకున్నాడు. ఈ నేపథ్యంలో కౌశిక్ స్థానిక సర్పంచ్ ప్రభాకరరెడ్డితో కలిసి బొగ్గుల వ్యాపారుల నుంచి కమీషన్ వసూలు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఆదివారం నల్లబోయనపల్లి నుంచి బొగ్గుల లారీ వెళ్తుండగా కౌశిక్ అడ్డుకున్నాడు. విషయం తెలుసుకున్న విశ్వనాథనాయుడు డి.చెర్లోపల్లి, సూర్యచంద్రాపురం, కట్టకిందపల్లి నుంచి దాదాపు 50 మందిని పిలుచుకొని నల్లబోయనపల్లికి చేరుకున్నాడు. తమ లారీలను అడ్డుకునేవాడు ఎవ్వడంటూ అనుచరులతో గ్రామంలో హంగామా సృష్టించాడు. అంతటితో ఆగక కౌశిక్ ఇంటి వద్దకు వెళ్లి.. అతడిపై దాడి చేశారు. ఇక్కడ జరిగిన విషయాన్ని కౌశిక్ బత్తలపల్లిలోని గంటాపురం అప్పస్వామి అలియాస్ జగ్గు అనుచరుడు ముష్టూరు సాంబకు ఫోన్ చేసి వివరించాడు. దీంతో సాంబ.. జగ్గు స్కార్పియో తీసుకుని నల్లబోయనపల్లికి చేరుకున్నాడు. అక్కడ సాంబ, కౌశిక్‌లపైన విశ్వనాథనాయుడు తన అనుచరులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్కార్పియో వాహన అద్దాలు ధ్వంసం చేశారు. అనంతరం స్థానికులు అడ్డుపడడంతో వారిని వదిలేశారు. తీవ్రంగా గాయపడిన కౌశిక్, సాంబను స్థానికులు 108 వాహనంలో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో నల్లబోయనపల్లి, కట్టకిందపల్లికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు లేకుండా టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

పింఛన్ తొలగింపు బాబు కుట్రే

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు రమేశ్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న పరిశీలకుడు రమేశ్‌రెడ్డి

మడకశిరరూరల్: దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. నూతన పింఛన్లు మంజూరు చేయలేక.. అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించి పెద్ద తప్పు చేస్తున్నారన్నారు. ఆదివారం హెచ్‌ఆర్ పాళ్యంలో ఆయన పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా పింఛన్ అందించారన్నారు. వ్యయప్రయాసలు.. పడిగాపులు దూరం చేసి ఠంచన్‌గా పింఛన్ అందించి లబ్ధిదారుల కళ్లల్లో సంతోషం నింపారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ సహా వందలాది హామీలలో కొన్నింటిని అదీ అరకొరగా అమలు చేస్తూ ప్రజలను వంచిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు పరిపాలనను గాలికి వదిలి రౌడీయిజం, అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అనర్హుల పేరిట తొలగింపు నోటీసులు జారీ అయిన దివ్యాంగులకు సెప్టెంబర్ ఒకటో తేదీన పింఛన్ ఇవ్వకపోతే.. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయిలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు.

దగ్గుపాటిని సస్పెండ్ చేయాలి

జూనియర్ ఎన్టీఆర్ కుటుంబంపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను రమేశ్‌రెడ్డి ఖండించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహించి ఆందోళనలు చేస్తున్నారన్నారు. వెంటనే ఎమ్మెల్యే దగ్గుపాటిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చాలా నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేల అవినీతి అక్రమాలు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు.

పేదల గూడుపై ‘పచ్చ’ కత్తి

అసలే పేదలు. అంతో ఇంతో సంపాదించిన సొమ్ము కుటుంబ పోషణ.. పిల్లల చదువులకు సరిపోతోంది. ఆర్థిక స్తోమత చాలక ఇంటి నిర్మాణం చేపట్టలేదు. ఇక మరికొంతమంది అష్టకష్టాలు పడి పునాది వరకు నిర్మించుకుంటే బిల్లు రాలేదు. దీంతో నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇలాంటి వారిపై ‘పచ్చ’ నేతలు ప్రతాపం చూపుతున్నారు. వారి పట్టాలు రద్దు చేయించి తమకు అనుకూలంగా ఉన్నవారికి అక్కడ చోటు కల్పించాలని తెర వెనుక మంతనాలు జరుపుతుండటం పేదల్లో కలవరం రేపుతోంది.

- జగనన్న కాలనీలపై దృష్టి
- ఖాళీ స్థలాలు, పునాదులే టార్గెట్
- ఆ పట్టాల రద్దుకు అధికారులపై ఒత్తిడి
- ఆ స్థానాల్లో టీడీపీ సానుభూతిరులకు ఇప్పించే కుట్ర



పుట్టపర్తి సమీపంలో బ్రాహ్మణపల్లి వద్ద ఖాళీగా ఉన్న స్థలాలు, పునాదులు



ధర్మవరం చెన్నకేశపురం వద్ద జగనన్న లేఅవుట్‌లో నిర్మించుకున్న ఇళ్లు

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వ పాలనలో పేదల సొంతింటి కల సాకారం ముందుకు సాగడం లేదు. అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ పరిధిలో రెండు సెంట్ల చొప్పున స్థలం మంజూరు చేసి.. నాణ్యమైన ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. 15 నెలలు గడిచినా స్థలాలు– పక్కాగృహాల గురించి ప్రభుత్వం ఎటువంటి స్పందనా లేదు. అయితే గత వైఎస్సార్‌సీపీ హయాంలో కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలను గుర్తించి జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి ప్లాట్లు కేటాయించింది. జిల్లాలో 298 జగనన్న లేఅవుట్లలో 30,985 ఇళ్లు మంజూరు చేసింది. ఇవి కాక సొంత స్థలం ఉన్న వారికి మరో 28,918 పక్కాగృహాలు మంజూరు చేసింది. 19,491 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 7,199 మంది లబ్ధిదారులు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. మిగిలిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

పేదలనే కనికరం లేకుండా..

గత ప్రభుత్వంలో ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభించని, పునాదులు నిర్మించుకున్నా ఇప్పటి వరకు బిల్లులు పడని వారి స్థలాలపై అధికార టీడీపీ నేతల కన్ను పడింది. సర్కారు కొలువుదీరి ఏడాది దాటినా పట్టాలు మంజూరు చేయలేదు. ఇటువంటి సమయంలో గతంలో పట్టాలు పొందిన పేదల స్థలాలను లాక్కోవాలని చేస్తున్న కుట్రలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అధికారుల ద్వారా ఒక జాబితా తయారు చేయించి పట్టాల రద్దు కోసం సీఎంఓ కార్యాలయానికి పంపినట్లు టీడీపీ నేతలే బహిరంగంగా చెబుతున్నారు. పట్టాలు రద్దయిన స్థలాలను తెలుగు తమ్ముళ్లు, టీడీపీ సానుభూతిపరులకు కట్టబెట్టాలని పన్నాగం పన్నుతున్నట్లు తెలుస్తోంది.


పట్టాల రద్దు చెల్లుతుందా..?

జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన పేద మహిళల పేరిట గత ప్రభుత్వం సచివాలయాల ద్వారా శాశ్వత రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా చేయించి, పూర్తి యాజమాన్య హక్కులు కల్పించింది. లబ్ధిదారులకు క్రయవిక్రయాలు జరుపుకునేందుకు వెసులుబాటు లభించింది. దీంతో ఒక్కో లబ్ధిదారుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆస్తి సొంతమైంది. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారు సొంతిళ్లలో హాయిగా జీవిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఖాళీ స్థలాలు, బిల్లులు కాకుండా పునాదులు వేసుకున్న లబ్ధిదారుల స్థలాల పట్టాలు రద్దు చేసేందుకు పన్నాగం పన్నినట్లు తెలుస్తోంది. గతంలో రిజిస్ట్రేషన్ అయినవి ఎలా రద్దు అవుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల వివరాలు

నియోజకవర్గం	మంజూరైనవి	పూర్తయినవి	మొదలు కాని ఇళ్లు
ధర్మవరం	16,172	4096	2,183
హిందూపురం	11,408	2,667	628
కదిరి	4,783	1,346	676
మడకశిర	1,073	483	243
పెనుకొండ	6,650	3,216	154
పుట్టపర్తి	18,810	5,148	2,731
రాప్తాడు	7,497	2,535	584


నిర్మాణానికి సాయం చేయండి



నాకు పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లి దగ్గర గత ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చి.. పక్కాగృహం మంజూరు చేసింది. అయితే ఆర్థిక పరిస్థితులు బాగలేక పోవటంతో గత ప్రభుత్వంలో ఇల్లు నిర్మించుకోలేకపోయాను. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టా రద్దు చేయకుండా.. ఇంటి నిర్మాణానికి మరింత ఆర్థిక సహాయం చేయాలి.

– మేదర లక్ష్మి, పుట్టపర్తి

రద్దు.. సరికాదు



జగనన్న కాలనీల్లో పేదలకు ఇచ్చిన పట్టాలను కూటమి ప్రభుత్వం రద్దుకు ఉపక్రమించాలనుకోవటం సరికాదు. ఆర్థిక స్తోమత లేక ఇంటి పనులు ప్రారంభించకుండా ఖాళీగా ఉన్న స్థలాలను రద్దు చేసే ఆలోచన మంచిది కాదు. వారికి మరొక అవకాశమిచ్చి మరింత ఆర్థిక సహాయం అందించి ఇళ్ల నిర్మాణాలకు తోడ్పాటునందించాలి. పునాదుల వరకు నిర్మాణాలు చేసి బిల్లు కాకుండా ఉన్న వారికి ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించి నిర్మాణాల పూర్తికి సహకరించాలి.

– ఈఎస్ వెంకటేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

తోడుకునోళ్లకు తోడుకున్నంత

జిల్లాలోని పెన్నానది పరివాహక ప్రాంతం ఇసుక అక్రమ రవాణాదారులకు కాసులు కురిపిస్తోంది. తోడుకునోళ్లకు తోడుకున్నంత అనే రీతిలో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇసుక అక్రమ వ్యాపారులకు తోడ్పాటునందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- పరిటాల కుటుంబం అండతో యథేచ్ఛగా ఇసుక దందా
- రోజూ ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలింపు
- సమాధులను సైతం వదలని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


పేరూరు వద్ద పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడంతో ఏర్పడిన గుంతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జిల్లాలోని రామగిరి మండలం పేరూరు సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. రోజూ ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పరిటాల కుటుంబం అండతోనే టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఇసుక దందాకు తెరలేపినట్లు ఆరోపణలున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో పెన్నానది పరివాహక ప్రాంతం గోతుల మయమవుతోంది.

సమాధులనూ తోడేస్తున్నారు....

పేరూరు గ్రామానికి శ్మశాన వాటిక లేకపోవడంతో కొన్నేళ్లుగా ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతే సమీపంలోని పెన్నానదిలో ఖననం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇసుక తవ్వకాలతో సమాధులు పెకలించి వేస్తున్నారు. అస్థిపంజరాలు బయటపడుతున్నాయి. ఇసుకతో పాటు ఎముకలు, పుర్రెలను సైతం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను పెన్నానది నుంచి తరలించి ఓ చోట డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి పొరుగున ఉన్న బెంగళూరు, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

అడుగంటిన భూగర్భజలాలు...

కొన్నేళ్లుగా పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో పేరూరుతో పాటు చాలా గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు విస్తారంగా వర్షాలు కురవడంతో పేరూరు డ్యాం పూర్తిగా నిండిపోయింది. దీంతో అప్పట్లో ఇసుక దందా కొనసాగించలేకపోయారు. అంతేకాక అప్పటి జగన్ ప్రభుత్వం సైతం ఇసుకను క్రమ పద్ధతిలో విక్రయాలు సాగించడంతో నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలకు తావు లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే పేరూరు సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపులు ఊపందుకున్నాయి. లక్షల కొద్ది మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమంగా తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించకపోతే పెన్నానది పరివాహక ప్రాంతంలో పంటల సాగు కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిత్రావతి నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపు


పుట్టపర్తి వద్ద చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పటిన తర్వాత టీడీపీ నాయకులు చిత్రావతి నది నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపులో చేపట్టి అక్రమార్జనకు తెరలేపారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు కూత వేటు దూరంలోనే చిత్రావతి నదిలో సాయినగర్ బైపాస్ వద్ద, దుర్గమ్మ గుడి వద్ద వందల కొద్ది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండడం గమనార్హం. ఆదివారాలు, పండగలు, జాతర్లు, ప్రభుత్వ కార్యాలయాల సెలవు రోజున ఈ దందా పెద్ద స్థాయిలో జరుగుతోంది. కూటమి నేతలు సిండికేట్‌గా మారి దందాకు తెరలేపడంతో అధికారులు సైతం పల్లెత్తు మాట మాట్లాడడం లేదు. ఇసుక తరలించే సమయంలో హారతి ఘాట్ మీదుగా కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి వరకూ ద్విచక్ర వాహనాల్లో పహారా కాస్తుంటారు. ఏదైనా అనుమానాస్పద అంశాలు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించి తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపులు అడ్డుకోకపోతే భవిష్యత్తులో పుట్టపర్తిలో తాగునీటి ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కారు ఢీ - వ్యక్తి మృతి

చిలమత్తూరు: కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గోరంట్ల మండలం పుల్లగూర్లపల్లికి చెందిన ఆంజనేయులు (50) ఆదివారం ఉదయం పని కోసం చిలమత్తూరు మండలం కమ్మయ్యగారిపల్లికి వచ్చాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమైన ఆయన 44వ జాతీయ రహదారిపై కంబాలపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులను 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి దుర్మరణం


చిక్కన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు...మడకశిర మండలం వైబీ హళ్లి గ్రామానికి చెందిన చిక్కన్న (72) మడకశిర సమీపంలోని ఓ దానిమ్మ తోటకు కాపలాదారుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఓ హోటల్‌లో కాఫీ తాడగానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా హిందూపురం వైపు నుంచి వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, వైబీ హళ్లి పంచాయతీ నాయకులు బాలకృష్ణారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి తదితరులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సీఐపై చర్యలకు కౌన్సిలర్ డిమాండ్

చిలమత్తూరు: హిందూపురం వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపాల్టీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ ఆసీఫ్‌వుల్లా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ కేవీ మహేష్‌ను కలసి ఫిర్యాదు పత్రం అందజేసి, మాట్లాడారు. శనివారం అల్‌హిలాల్ కాంప్లెక్స్ వద్ద మందులు కొనుగోలు చేసి నిల్చొని ఉండగా పోలీసు జీపులో వచ్చిన సీఐను గమనించి గౌరవంగా నమస్కరించానన్నారు. దీనికి ఆగ్రహంతో సీఐ ఊగిపోతూ చొక్కా పట్టుకుని లాగడంతో అది కాస్త చినిగిపోయిందన్నారు. అలాగే తనను స్టేషన్ వరకూ తీసుకెళ్లి దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను అవమానించిన సీఐ రాజగోపాల్‌నాయుడుని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

రైతు కూలీ బిడ్డకు డీఎస్సీలో ఐదో ర్యాంకు


ఈరనారప్ప

బత్తలపల్లి: మండల కేంద్రంలో నివాసముంటున్న బాలగొండ ఈరనారప్ప డీఎస్సీ ఫలితాల్లో ఐదో ర్యాంక్ సాధించాడు. ఈరనారప్ప తల్లిదండ్రులు నారాయణస్వామి, నారమ్మ దంపతులు సాధారణ రైతు కూలీలు. వీరిది రాప్తాడు మండలం బండమీదపల్లి స్వగ్రామం. 15 సంవత్సరాల క్రితం బత్తలపల్లికి వలస వచ్చి ఇక్కడే ఉంటున్నారు. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) విభాగంలో జిల్లా స్థాయిలో ఐదో ర్యాంక్‌తో పాటు టీజీటీలో 114వ ర్యాంకు, పీజీటీ విభాగంలో 94వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటిన ఈర నారప్పను పలువురు అభినందించారు.

నేడు 'పరిష్కార వేదిక'

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్పీ వి.రత్న ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పని సరిగా వెంట తీసుకెళ్లాలి.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


హాజీవలి

కదిరి టౌన్: బతుకు తెరువు కోసం వైఎస్సార్ కడప జిల్లా నుంచి వలస వచ్చిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన హాజీవలి (24) బతుకు తెరువు కోసం కదిరికి వచ్చి స్థానిక అరబిక్ రెస్టారెంట్‌లో పనిచేస్తూ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న అద్దె గదిలో స్నేహితులతో కలి ఉంటున్నాడు. ఆదివారం వేకువజాము 2 గంటల సమయంలో మిత్రులతో కలిసి భోజనం చేసిన అనంతరం కవర్లు పడేసేందుకు గది నుంచి బయటకు వచ్చిన హాజీవలి.. పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌కు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన మిత్రులు ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. హాజీవలి తండ్రి హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రియురాలికి పెళ్లి.. ప్రేమికుడి ఆత్మహత్య


జయకృష్ణ (ఫైల్)

యాడికి: తాను ప్రేమించిన యువతికి మరో యువకుడితో పెళ్లైనట్లు తెలుసుకుని క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన బాలగంగన్న, సుశీల దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడికి వివాహమైంది. చిన్న కుమారుడు జయకృష్ణ (22) ఓ యువతిని ప్రేమిస్తున్నానని.. ఆమెతో తనకు పెళ్లి చేయాలని 3 నెలల క్రితం తల్లిదండ్రులను కోరాడు. అయితే నెల రోజుల క్రితం ఆ యువతికి మరో యువకుడితో ఆమె తల్లిదండ్రులు పెళ్లి చేసినట్లుగా తెలిసింది. దీంతో మనోవేదనకు లోనైన జయకృష్ణ శనివారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం తన గదిలోకి వెళ్లి నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున పిలిచినా స్పందన లేకపోవడంతో మిద్దెపైకి ఎక్కి గవాక్షం నుంచి కుటుంబసభ్యులు చూశారు. అప్పటికే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న జయకృష్ణను గమనించి బలవంతంగా తలుపులు తీసి మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రెస్టారెంట్ సీజ్


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కదిరి టౌన్: స్థానిక అరబిక్ రెస్టారెంట్‌ను మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఆదివారం సీజ్ చేశారు. ఇప్పటికే అందిన పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఆదివారం మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల నాణ్యత లోపం, అపరిశుభ్రత ప్రదేశంలో ఆహార పదార్థాలు నిల్వ, తిని వదిలేసిన చికెన్, మటన్ ముక్కలను తిరిగి వడ్డిస్తున్నట్లుగా తనిఖీల్లో గుర్తించారు. కుళ్లిన చికెన్, మటన్ వండుతుండడం, గడువు తీరిన మసాలాలు వినియోగించడాన్ని మున్సిపల్ కమిషనర్ గుర్తించి రెస్టారెంట్ నిర్వాహకులను నిలదీశారు. అనంతరం రెస్టారెంట్‌ను సీజ్ చేశారు.

ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి

- జేవీవీ మహాసభలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్


మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

ధర్మవరం అర్బన్: ప్రజల్లో శాస్త్రీయ దృక్పథంతో పాటు ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడే ప్రభుత్వాలు జవాబుదారీగా వ్యవహరిస్తాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ధర్మవరంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాలు కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకుని వారికి లాభాలు తెచ్చిపెట్టే వనరుగా మారిపోయాయన్నారు. విద్యా వ్యవస్థలో సృజనాత్మకతకు స్థానం లేకపోగా ర్యాంకులకు ప్రాధాన్యత పెరిగి పిల్లలను పరిశోధనల వైపు ప్రోత్సహించడం సన్నగిల్లిందన్నారు. ఈ మార్పులను అవగాహన చేసుకుని జేవీవీ కార్యాచరణతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జేవీవీ రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ.. సైన్స్‌ను హేళన చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా చీకటి సామ్రాజ్యాలను నిర్మించుకున్న బాబాలు, స్వామీజీలకు ప్రభుత్వాల నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు దొరకడం బాధాకరమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే ఇలాంటి చర్యలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రజాస్వామ్య విలువలు అడుగంటుతున్నాయన్నారు. ప్రజలు అభద్రతకు లోనవుతున్నారని తెలిపారు. డాక్టర్ ఈటీ రామ్మూర్తి మాట్లాడుతూ.. రచయితలు, కళాకారులు, విద్యార్థులు, ప్రజాస్వామిక శక్తుల మీద, ప్రశ్నించే వాళ్ల మీద దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ టీఎం బషీర్ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల ఫలితాలను సామాన్యులకు చేరువ చేయాల్సిన బాధ్యత జేవీవీ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, కోశాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సానే రవీంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి, నర్సారెడ్డి, చైతన్య, గంగిరెడ్డి, గౌస్ లాజం, సురేష్, నిర్ధారణుడు, సంజీవప్ప, లక్ష్మీనారాయణ, షర్ఫుద్దీన్, మహేష్, లోకేష్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ


సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి యూత్ సభ్యులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా ఒడిశా రాష్ట్ర సత్యసాయి యూత్ సభ్యులు పుట్టపర్తికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయిని కీర్తిస్తూ వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను పరవశింపజేసింది. అనంతరం వారు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

పరిగి: మండలంలోని హొన్నంపల్లి వద్ద గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రంగడు యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుంది. బిస్కెట్ కలర్ చీర, నలుపు రంగు జాకెట్ ధరించింది. పరిగి చెరువులోని మట్టిగుంతలో పడి మృతి చెందడంతో గుర్తు పట్టలేని విధంగా మృతదేహం మారింది. మహిళ మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94407 96841, 94409 01879 నంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

వివాహిత బలవన్మరణం


మృతురాలు బీరే లత


ధర్మవరం అర్బన్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని సంజయ్ నగర్‌కు చెందిన రాము, బీరే లత (38) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లతకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లిన భర్త ఇంటికి వచ్చి చూసేసరికి ఉరికి వేలాడుతున్న భార్య కనిపించింది. స్థానికుల సాయంతో ఆమెను కిందకు దించి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'అగ్నివీర్'కు 159 మంది అర్హత


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులు

తిరుపతి రూరల్: అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ రాత పరీక్షల్లో తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీకి చెందిన 159 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ మేరకు ఆ అకాడమీ చైర్మన్ బి.శేషారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. వీరికి ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇచ్చి, ఉద్యోగంలో చేరడానికి అవసరమైన సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అంజినప్పకు బళ్లారి రాఘవ జాతీయ పురస్కారం



బత్తలపల్లి: కళాకారుడు, తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్.అంజినప్పకు కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ జాతీయ పురస్కారం దక్కింది. ఈ మేరకు ఆదివారం ఆయనకు నిర్వాహకులు డాక్టర్ శీలా బ్రహ్మయ్య నుంచి సమాచారం అందింది. కళాభిషేకం కార్యక్రమం ద్వారా ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో దాగి ఉన్న మట్టిలో మాణిక్యాల్లాంటి వందలాది మంది కళాకారులను ప్రోత్సహిస్తూ, పరిషత్ నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ, ఆదరణ కోల్పోయిన సీనియర్ కళాకారులకు తగిన సాయమందిస్తున్న కళాసేవకు గుర్తుగా అంజినప్పకు పురస్కారం దక్కింది. సెప్టెంబర్ 6న జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమాలో అవార్డును ఆయన అందుకోనున్నారు. ఈ సందర్భంగా అంజినప్పను వైఎస్సార్‌సీపీ కల్చరల్ వింగ్ ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు షరాబ్ యోగానంద ఆచారి, పలువురు కళాకారులు, ట్రస్ట్ సభ్యులు అభినందించారు.

అ'పూర్వ' సమ్మేళనం


47 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మడకశిర: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978–80 విద్యాసంవత్సరంలో ఇంటర్ చదివిన వారు అదే కళాశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. దాదాపు 47 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి చిలిపి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఇదేనా బాలికాభివృద్ధి?


జోలె వేసుకుని భిక్షాటనకు వెళ్తున్న బాలికలు

అనంతపురం ఎడ్యుకేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్న బాలికాభివృద్ధి ప్రకటనల్లో తప్ప చేతల్లో కనిపించడం లేదు. ఏటా ప్రత్యేక సర్వేలు నిర్వహించి బడిఈడు పిల్లలందరినీ గుర్తించి వారితో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడుల్లో చేర్పిస్తున్నారు. ఇందు కోసం రూ.లక్షల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. అయినా క్షేత్ర స్థాయిలో బడిఈడు పిల్లలు భిక్షాటనతో బతుకీడుస్తూనే ఉన్నారు. ఇందుకు నిదర్శనమే ఈ చిత్రాలు. నగర శివారులోని రాచానపల్లి వద్ద నలుగురు బాలికలు (అందరూ 10-12 ఏళ్లలోపు) జోలెలు భుజాన తగిలించుకుని భిక్షాటనకు వెళుతున్నారు. నగరంలో మరో ఇద్దరు బాలికలు సంచులు భుజాన వేసుకుని చిత్తుకాగితాల సేకరణలో నిమగ్నమయ్యారు. మరో బాలిక తల్లితో కలసి భిక్షాటనకు వెళ్తోంది. పుస్తకాలు పట్టుకుని చదువుకోవాల్సిన వయసులో బాలికలు భిక్షాటన చేయడం, చిత్తుకాగితాలు ఏరుకోవడం చూపరుల హృదయాలను కదిలిస్తున్నాయి. అవగాహన లేకపోవడం ఒక కారణమైతే, ఆ దిశగా ఎవరూ పట్టించుకోకపోవడం మరో కారణమని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని ఇలాంటి పిల్లలను గుర్తించి బలవంతంగానైనా బడిబాట పట్టించే చర్యలు తీసుకుంటే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అరుదైన రక్తదానంతో రోగికి ప్రాణదానం


రక్తదానం చేస్తున్న పరుశురాముడు

గుంతకల్లు: అరుదైన 'ఓ' నెగిటివ్ రక్త దానంతో క్యాన్సర్ రోగికి ప్రాణదానం చేశాడు గుంతకల్లుకు చెందిన పరుశురాముడు. వివరాలు.. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన కేవీ లక్ష్మి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అరుదైన 'ఓ' నెగిటివ్ (బాంబే బ్లడ్) గ్రూప్ ఉన్న ఆమెకు శస్త్రచికిత్స చేయాల్సి ఉండడంతో రక్తం అవసరమై కుటుంబసభ్యులు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్రల్లోని పలువురు రక్తదాతలను సంప్రదించారు. విషయం గుంతకల్లులోని ప్రాణదాత సేవా సమితి సభ్యులకు తెలియడంతో ఓ నెగిటివ్ బ్లడ్ కలిగిన పరుశురాముడుకు సమస్య వివరించారు. దీంతో ఆయన ఆదివారం స్థానిక గోపీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేయడంతో లక్ష్మి కుటుంబసభ్యుడు సురేష్ జాగ్రత్తగా తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా పరుశురాముడుని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రాణదాత సేవా సమితి సభ్యులు తిమ్మప్ప, హనుమంతు, హుస్సేన్, బర్మాశాల రఘు, గఫూర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పరుశురాముడు మాట్లాడుతూ.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కేవలం 18 మంది మాత్రమే 'ఓ' నెగిటివ్ బ్లడ్ గ్రూప్ కలిగిన వారున్నారన్నారు. ఇందులో తరచూ ఆరుగురు మాత్రమే రక్త దానానికి ముందుకు వస్తున్నారని, ఇప్పటి వరకూ తాను 35 సార్లు రక్తదానం చేసినట్లు వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

మహాలక్ష్మి ITI
■ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ప్లంబర్ ట్రేడ్‌లకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. సంప్ర: రాచంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ : 99893 76326, బస్టాండ్ ఎదురుగా, ATP. [A-7169]

ఉచిత కంప్యూటర్ శిక్షణ
■MR టెక్నాలజీస్ & జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో కోర్సులు: MS ఆఫీస్ & ఇంటర్నెట్ కాన్సెప్ట్స్. @ సాయి నగర్ 8వ క్రాస్, ATP. 8143968949. [A-1675]

DMLT ADMISSIONS
■ DMLT 2 సంవత్సరముల కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. # SEEDS కాలేజ్, కమలానగర్, అనంతపురం. సెల్: 9100494926, 9440255034. [SCA 25007543]

REAL ESTATE

PLOTS FOR SALE
■ అరవకూరు దగ్గర బళ్లారి హైవేకు మొదటి బిట్టు ఎయిర్‌పోర్ట్ దగ్గర లోని 25 సెంట్స్ & 25 సెంట్స్ గల 2 ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర:8688397109. [A-1680]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు
అమ్మకం
రియల్ ఎస్టేట్
ఫర్నిచర్
ఆటోమొబైల్
కంప్యూటర్స్
సర్వీసెస్
కావలెను
4 లైన్లు రూ: 270/-
అదనపు లైను రూ: 60/-
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

WANTED
■ Wanted Staff to Degree College : Commerce & Management, English, Chemistry, Computer Science. Ph. No: 9491156253, 7075468222. [SCA-25007448]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ BELL INFRA, ATP నందు పనిచేయుటకు 1-3 సంవత్సరాలు అనుభవంగల మార్కెటింగ్ మేనేజర్స్ మరియు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫిక్స్‌డ్ జీతం తోపాటు ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సెల్ : 8919159081. [SCA25007508]

■ Wanted Assistant Manager for Anantapur's Biggest Furniture Showroom- "Mamatha Furniture". Salary: ₹20,000 + Incentives. Requirements / Education: Degree / 2 Years Retail Experience / Basic Computer Skills. Interviews on: 24th & 25th August @ 11 Am to 5 pm. Address: Opp: Market yard, Gooty Road, Anantapur. [A-1679]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్. జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA25007487]

■ ప్రముఖ MNC కంపెనీలోకి యువతి/ యువకులు కావలెను. వర్క్ ఫ్రమ్ హోం కలదు. జీతం: 18k-30k అర్హత: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ITI సంప్రదించండి: 8792811822, 9901042458. [G-713]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.